www.citytimesnews.com

# సిటీటైమ్స్

తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 25 | సంచిక - 340 | హైదరాబాద్ | గురువారం | తేదీ: 05.06.2025 | పేజీలు 8 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## ఇరాన్‌లో కిడ్నాప్ అయిన భారత యువకులు క్షేమం

- ఇండియన్ ఎంబసీ పోస్ట్
- దుండగుల చెర నుంచి కాపాడిన పోలీసులు 3లో..
- పంజాబ్‌కు చెందినవారుగా గుర్తింపు
- డబ్బులు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు

## బ్యాగులో మహిళ మృతదేహం మేడ్చల్‌లో దారుణ ఘటన

- బాచుపల్లి పీయస్ పరిధిలో వెలుగులోకి
- బ్యాగ్ నుంచి దుర్వాసన రావడంతో ఫిర్యాదు
- ఘటనా స్థలానికి చేరి పరిశీలించిన పోలీసులు
- దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక టీంలు
- మహిళ వయస్సు 25 నుంచి 30 ఏండ్లు 3లో..

## అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి

- అగ్ని ప్రమాద బాధితుల పట్ల అమానవీయ ప్రవర్తన
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- సీఎం రేవంత్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ
- విద్యుత్ శాఖ అధికారి అనైతికంగా వ్యవహరించారు
- రూ.2.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు 7లో..

## టెట్ ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల

- జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) పద్ధతిలో
- రోజు 2 సెషన్లలో పరీక్ష
- 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు 5లో..

## ఆపరేషన్ సిందూర్‌ని వ్యతిరేకించలేదు

- రాహుల్ ని తప్పుగా అర్థం చేసుకున్నరు
- మాకు భారత రక్షణ దళాలంటే గౌరవం
- ఆర్మీ కి వ్యతిరేకంగా మాట్లాడలేదు
- స్పష్టత ఇచ్చిన వీహెచ్

హైదరాబాద్, సిటీ టైమ్స్
పెహాల్గాంలో 27 మంది భారతీయులను చంపిన దుర్మార్గం చర్యపై ప్రతి భారతీయుడు చాలా సీరియస్ గా ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు, ప్రధాని మోడీకి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని.. ఆ తర్వాత 9 ఉగ్రవాద స్థావరాల మీద ఆపరేషన్ సిందూర్ చేయడం జరిగిందన్నారు. 6లో..

## బుడతడి బిర్యానీ కోరిక



7లో..

## యూట్యూబర్ అరెస్టు

- పాక్‌కు గూఢచర్యం కేసులో
- పంజాబ్ పోలీసుల అదుపులో నిందితుడు
- జాన్‌మహల్ అనే పేరుతో యూట్యూబర్ 6లో..

## 2 వేల కోట్ల స్కామ్‌లో సిసోడియా, సత్యేంద్రకు సమన్లు



7లో..

# ఆర్సీబీ సంబరాల్లో విషాదం 11 మంది మృతి

- బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఘటన
- గేటు విరగొట్టిన అభిమానులు
- 35 వేల కెపాసిటీ.. 3 లక్షల మంది
- గేట్ 2 నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం
- తాళాలు వేసి ఉంచిన సెక్యూరిటీ
- కిందపడిపోవడంతో తొక్కిసలాట.. 50 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- న్యాయ విచారణకు ఆదేశించిన సీఎం సిద్ధరామయ్య





బెంగళూరు, సిటీ టైమ్స్
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమంలో పెను విషాదం చోటు చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతిచెందారు. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు భారీగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. 2లో..



## జులై 21 నుంచి పార్లమెంట్

- వర్షా కాల సమావేశాలు
- ప్రకటించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు
- జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు పార్లమెంట్
- ఇటీవల సభ నిర్వహించాలని విపక్షాల పట్టు
- పలు కీలక బిల్లులు ఆమోదించే చాన్స్ 7లో..



## మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

హైదరాబాద్, సిటీ టైమ్స్
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. జూలై నెలలో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో కీలకమైన అంశం వార్డుల విభజన. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఒక స్పష్టమైన షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2లో..

## కవితకు తెలంగాణ పౌరుషం లేదు

- అమెరికాలో ఉద్యోగం చేశారు కదా...
- కవితపై బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఫైర్
- మాలాంటి వారికి తెలంగాణ వాదం నేర్పించింది బీజేపీ
- మాకే తెలంగాణ పౌరుషం ఉంటది 2లో..



## బద్నాం చేసేందుకే నోటీసులు

- కేసీఆర్ ఈమేజ్‌ను దెబ్బతీస్తున్నరు
- రేవంత్ సర్కార్‌పై కవిత ఫైర్
- కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి మహా ధర్నా
- కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీకి వ్యతిరేకంగా
- రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు 2లో..



హైదరాబాద్, సిటీ టైమ్స్
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని.. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ గారు చేసిన తప్పా ?

## దద్దరిల్లిన పెద్ద ధన్వాడ

- ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఆందోళన
- పలు వాహనాలు ధ్వంసం.. నిప్పు 2లో..
- టెంట్లకు నిప్పు పెట్టిన నిరసనకారులు
- 12 గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తం



## నర్సు తప్పుడు ఇంజెక్షన్.. ఆరుగురు రోగులు మృతి

- సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- ఒడిశాలోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో ఘటన 2లో..
- సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజీలో దారుణం
- మృతులంతా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నవాళ్లే

భువనేశ్వర్, సిటీ టైమ్స్
వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఆరు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నర్సు తప్పుడు ఇంజెక్షన్ ఇవ్వడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశా లోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో గల సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

## కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

- కన్నడ భాషపై చేసిన కామెంట్లే కారణం
- తమిళం నుంచే కన్నడ పుట్టిందన్న కమల్
- తీవ్రంగా వ్యతిరేకించిన కన్నడగుడిలు
- క్షమాపణ చెప్పాలని డిమాండ్.. నో చెప్పిన హసన్
- హైకోర్టు కూడా నటుడిపై ఆగ్రహం 2లో..

సిటీ టైమ్స్
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com



## నర్సు తప్పుడు ఇంజెక్షన్..
# ఆరుగురు రోగులు మృతి

**భువనేశ్వర్, సిటీ టైమ్స్**

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఆరు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నర్సు తప్పుడు ఇంజెక్షన్ ఇవ్వడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశా లోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో గల సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఈ ఆసుపత్రిలోని ఐసీయూ, సర్జికల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఐదుగురు రోగులు నిన్న రాత్రి వేళ గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయారు. వీరు మరణించడానికి కొన్ని నిమిషాల ముందు ఆసుపత్రి సిబ్బంది వీరికి రెండో రౌండ్ ఇంజెక్షన్లు వేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ''అర్ధరాత్రి సమయంలో ఓ నర్సు వచ్చి మా పక్కన ఉన్న ముగ్గురు రోగులకు ఇంజెక్షన్ ఇచ్చారు. మా సోదరికి కూడా అలాంటి సూది మందే వేశారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే ఆమె నొప్పితో విలవిల్లాడిపోయింది. డాక్టర్ వచ్చి చెక్ చేసేలోపే ప్రాణాలు కోల్పోయింది'' అని ఓ మృతురాలి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆందోళన కొనసాగుతుండగానే.. బుధవారం ఉదయం కూడా ఐసీయూలో చికిత్స పొందుతున్న మరో రోగికి ఇంజెక్షన్ ఇచ్చారు. కాసేపటికే ఆ రోగి కూడా ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య 6కు చేరింది.

చనిపోయిన రోగులంతా ఈ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారని, సర్జరీ తర్వాత వారి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని మృతుల కుటుంబసభ్యులు తెలిపారు. ఎప్పుడైతే ఇంజెక్షన్ డోసు ఇచ్చారో.. ఆ తర్వాతే వారి ఆరోగ్యం ఉన్నట్టుండి క్షీణించిందని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి సిబ్బందిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోస్టుమార్టం తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం ఇంకా స్పందించలేదు. మరోవైపు, కాంగ్రెస్ నేతలు వైద్య కళాశాల వద్ద ధర్నాకు దిగారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బద్నాం చేసేందుకే నోటీసులు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని.. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ గారు చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జు ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు.

తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి - పెన్నా అనుసంధానం పేరిట నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. ఎనిమిది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. గోదావరి నీటిలో వెయ్యి టీఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మంచిర్యాల, రామగుండం ప్రాంతంలో ధర్నాకు వస్తున్న జాగృతి కార్యకర్తలను అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎందుకు ఇంత భయపడుతున్నది? ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమన్నారు. హైదరాబాద్‌లో ధర్నా చేయనివ్వకపోతే జిల్లాల్లో, గల్లీల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## కమల్‌హాసన్ రాజ్యసభ
# నామినేషన్ వాయిదా

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**



'థగ్ లైఫ్' సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే తన చిత్రం 'థగ్ లైఫ్' వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్లు తెలిపాయి. కమల్ 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకేఎంఎన్ఎం ఇటీవల ఖరారు చేశాయి.

ఇటీవల నిర్వహించిన 'థగ్‌లైఫ్' సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం, తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ 'కేఎఫ్‌సీసీ'కి కమల్ లేఖ రాశారు. అయితే, అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

# కవితకు తెలంగాణ పౌరుషం లేదు

- మాది హిందుగాళ్లు బొందు గాళ్ళు అన్న రక్తం కాదు
- కవిత స్టేట్మెంట్ ఇచ్చే ముందు స్థాయి చూసుకోవాలి

**హైదరాబాద్, సిటీ టైమ్స్**



అమెరికాలో ఉద్యోగం చేసిన కవితకు తెలంగాణ పౌరుషం లేదని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. తమ లాంటి వారికి తెలంగాణ వాదం నేర్పించింది బీజేపీ అని.. తమకు కాకుండా ఇంకెవరికి తెలంగాణ పౌరుషం ఉంటది? అన్నారు. తమది హిందుగాళ్లు బొందు గాళ్ల అన్న రక్తం కాదని.. కవిత స్టేట్మెంట్ ఇచ్చే ముందు స్థాయి చూసుకోవాలని విమర్శించారు. తాజాగా ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాహుల్ గాంధీది ఇటలీ రక్తం.. మోడీది హిందువు రక్తం అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటలీ గాంధీ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని.. అమెరికా చెప్తే వినడానికి మాది పాత భారత్ కాదు ఇది కొత్త భారత్ అని తెలిపారు. రాహుల్ టి షర్ట్స్ వేసుకోవడం మాని తెలివితో మాట్లాడాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ధర్నా చౌక్‌లు ఎత్తేసిందని.. కల్వకుంట్ల కుటుంబానికి, కవితకు ధర్నా చౌక్ లో నిలబడే అర్హత లేదన్నారు. కాళేశ్వరానికి అన్ని తానే అని అపర బ్రహ్మ కేసీఆర్ చెప్పుకున్నారు.. అపర బ్రహ్మ అని చెప్పుకున్న కేసీఆర్‌కు కూతురు కవిత డాడీ డాడీ స్ట్రక్చర్ ఎలా నిర్మించారని మరొక్క లెటర్ రాయాలని బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఏ కాలేజీలో చదివారు.. ఎక్కడ సివిల్ ఇంజనీరింగ్ చేశారు? ఎన్ని ప్రాజెక్ట్ లు చేశారు? అని ప్రశ్నించారు. తాము ఇప్పటిదాకా ఈడీ ఒక్కదాన్నే చూపించామని.. మీరు చూడాల్సిన డీలు ఇంకా చాలా ఉన్నాయన్నారు. అధికార గణమంతా అందాల భామల చుట్టూ తిరిగారని.. తెలంగాణ రైతులు పండించిన పంట కొనుగోలు పూర్తిగా జరగలేదన్నారు. రైతులు వారి బాధలు చెప్పుకునేందుకు బీజేపీ భరోసాకు క్యూ కట్టారని వెల్లడించారు. సీఎం, మంత్రులు పరిపాలనను గాలికి వదిలి ఢిల్లీలో మకాం వేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి 18 నెలల్లో 45 సార్లు ఢిల్లీకి వెళ్లారన్నారు. భరోసాలో జాబ్ క్యాలెండర్ పై ఫిర్యాదులు వచ్చిందన్నారు.. వర్షాకాలం ముందే వచ్చిన రైతు బంధు రాకపోవడం బాధాకరమని తెలిపారు. మీ కుమ్ములాటలు పక్కన పెట్టి వెంటనే రైతు బంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- జూన్ 21లోపే నిర్వహించేందుకు ప్రణాళికలు
- వార్డుల విభజనకు షెడ్యూల్ విడుదల
- మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి ఉత్తర్వులు

**హైదరాబాద్, సిటీ టైమ్స్**




తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. జూలై నెలలో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో కీలకమైన అంశం వార్డుల విభజన. దీనికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఒక స్పష్టమైన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 21వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 43 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉండగా.. వాటిలో ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) బయట ఉన్న 30 పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే వార్డుల విభజన చేపట్టాలని నిర్ణయించారు. దీనికి కారణం.. ఓఆర్ఆర్ లోపల ఉన్న 13 పట్టణ స్థానిక సంస్థలను జి.హెచ్.ఎం.సి. (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) లో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించడం. ఈ విలీనం పూర్తయిన తర్వాత, ఆ ప్రాంతాల్లో వార్డుల విభజన చేపడతారు.

వార్డుల విభజన చేపడుతున్న వాటిలో 18 కొత్త మున్సిపాలిటీలు, మరో 12 కార్పొరేషన్లు, పాత మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. అలాగే నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా వంటి మున్సిపాలిటీలు కూడా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన కోహీర్, కేసముద్రం, అశ్వరావుపేట, స్టేషన్ ఘన్‌పూర్, ఏదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కొల్లాపూర్, అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట వంటి కొత్త మున్సిపాలిటీల్లో కూడా వార్డుల విభజన జరగనుంది.

**వార్డుల సంఖ్య పెంపు: ప్రాతినిధ్యం విస్తరణ**

కొత్తగా ఎలాంటి గ్రామాలు కలవడం కానీ, విడిపోవడం కానీ జరగని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన అవసరం లేదని తేల్చారు. అలాగే.. పాలకవర్గాల పదవీకాలం ఇంకా ముగియని ఏడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో (కొత్తూరు, నకిరేకల్, జడ్చర్ల, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట,) ప్రస్తుతం విభజన చేపట్టడం లేదు. వాటి పదవీకాలం పూర్తయిన తర్వాతనే ఈ ప్రక్రియ మొదలవుతుంది. సమీప గ్రామాలను విలీనం చేయడం వల్ల వార్డుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. ఉదాహరణకు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న 49 వార్డుల సంఖ్య 60కి పెరగనుంది. మంచిర్యాలలో 36 నుంచి 60కి, కరీంనగర్‌లో 60 నుంచి 66కు, రామగుండంలో 50 నుంచి 60కి, కొత్తగూడెంలో 34 నుంచి 60కి వార్డుల సంఖ్యను పెంచనున్నారు. నర్సంపేటలో 24 నుంచి 30కి, పరిగిలో 15 నుంచి 18కి, జగిత్యాలలో 48 నుంచి 50కి పెరగనుండగా, కొల్లాపూర్‌లో మాత్రం వార్డుల సంఖ్య 20 నుంచి 19కి తగ్గనుంది. ఈ విభజన ప్రక్రియలో 2021 జనవరి 30న జారీ చేసిన మార్గదర్శకాలనే అనుసరిస్తున్నారు. వార్డుల విభజన పూర్తవగానే, ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను సవరించే పనిని చేపడుతుంది. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన.. ఓటరు జాబితా తయారీని పూర్తి చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితా సిద్ధమైంది.. త్వరలోనే ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లు ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా తయారీ పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయ కోలాహలం నెలకొననుంది. ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

## ఆర్సీబీ సంబరాల్లో విషాదం
# 11 మంది మృతి

**బెంగళూరు, సిటీ టైమ్స్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమంలో పెను విషాదం చోటు చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11మంది మృతిచెందారు. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు భారీగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్ 2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయపడ్డారు. మృతుల్లో పలువురు మహిళలు సైతం ఉన్నారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

**ప్రముఖుల దిగ్భ్రాంతి**

తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ హృదయ విదారక ఘటనలో ఘటనలో మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

**బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..**

ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్‌కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.



# దద్దరిల్లిన పెద్ద ధన్వాడ

- రహస్యంగా పనులు ప్రారంభించిన గాయత్రి కంపెనీ
- ఇది తెలుసుకుని రైతుల ఆందోళన
- భారీగా పోలీసుల మోహరింపు
- జోగులాంబ గద్వాల జిల్లాలో ఘటన

**జోగులాంబ గద్వాల, సిటీ టైమ్స్**

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామం నిరసనలతో దద్దరిల్లింది. స్థానికంగా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా 12 గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వం పనులు ఆపేస్తున్నామని హామీ ఇచ్చినప్పటికీ.. గాయత్రి కంపెనీ యాజమాన్యం తిరిగి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రయత్నించడంతో ప్రజా ఆగ్రహం పెల్లుబికింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు కంపెనీ వాహనాలను ధ్వంసం చేశారు. టెంట్లు, కంటెయినర్లకు నిప్పు పెట్టారు.

వివరాల్లోకి వెళితే.. జూన్ 2న అర్ధరాత్రి గ్రామస్తులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో గాయత్రి కంపెనీ యాజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి రహస్యంగా కూలీలను, కంటైనర్ హౌస్‌ను, జేసీబీలు, బొలేరో ట్రక్కులను తరలించింది. కూలీలు వంట చేసుకోవడానికి సామగ్రి, చిన్న పూరిపాక లాంటివి ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన కొంతమంది రైతులు చుట్టుపక్కల గ్రామాలకు సమాచారం ఇచ్చి పరిశ్రమ నిర్మాణ రహదారిలో బైఠాయించి నిరసన తెలిపారు. అయినా యాజమాన్యం నుంచి స్పందన రాలేదు.

దీంతో బుధవారం ఉదయం ఆగ్రహించిన 12 గ్రామాల రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భారీగా పోలీసులు మోహరించినప్పటికీ వారిని అడ్డుకోవడం కష్టమైంది. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ.. పరిశ్రమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టెంట్లను, కంటైనర్ హౌస్‌ని ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. అక్కడున్న బొలేరో ట్రక్కును తిరగేసేశారు. అంతే కాకుండా, అక్కడున్న కూలీలను రాళ్లతో తరిమికొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఆరోగ్యానికి, వ్యవసాయానికి హానికరమని భావిస్తున్న ఈ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఈ 12 గ్రామాల ప్రజలు గత కొన్ని నెలలుగా అడ్డుకుంటూనే ఉన్నారు. స్థానిక ప్రజల ఆవేదనను అర్థం చేసుకున్న ప్రభుత్వం కంపెనీ ఏర్పాటు నిర్ణయంపై వెనక్కి తగ్గింది. అయితే గాయత్రి కంపెనీ యాజమాన్యం తాజా చర్యతో ప్రజాగ్రహం పెల్లుబికి ఉద్రిక్తతలకు దారి తీసింది.



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం



**ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి**
**సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి**
**-పిఎసి చైర్మన్ గాంధీ**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పిఎసి చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు. బుధవారం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్ పేట్ కి చెందిన లికియా బేగంకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.32వేలు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయాన్ని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని గాంధీ అన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,కరుణాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# నాడు ప్రతిపక్ష నాయకుడిగా నేడు ప్రజా నాయకుడుగా రేవంత్ రెడ్డి పాలన

**-వి జగదీశ్వర్ గౌడ్**



**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేడు ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితం దూరం అయిందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలని, పార్కులు అభివృద్ధి చేయాలని, ఒక్క ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వం ప్రజలను ఉపయోగం లేని చెట్లను నాటడం, పలు సమస్యలపై మేయర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి ద్వారా అధికారులను ప్రశ్నిస్తూ ప్రసంగించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి జగదీశ్వర గౌడ అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా





**- మున్సిపల్ అధికారులు పాత అలవాట్లు పక్కకెట్టి పనిచేయండి....**
**- అందరికీ అండగా ఉంటా...**

**- ఆపదలో ఆప్తుడిగా వస్తా...**
**- ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి...**
**- 100 రోజుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే...**

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ జూన్ 4**

వనపర్తి మున్సిపాలిటీలో పనిచేసే అధికారులు సిబ్బంది అందరూ వారి వారి పాతా అలవాట్లను పక్కకు పెట్టి పట్టణాభివృద్ధి కోసం పని చేయాలని మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అండగా ఉంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు బుధవారం వనపర్తి మునిసిపాలిటీలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు వార్డు అధికారులుగా, మెప్మా ఆర్పీలుగా, జవాన్లుగా, మీరు నిరంతరం వనపర్తి పట్టణ ప్రజలకు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి వనపర్తి జిల్లా కేంద్రం పై ఉందని త్వరితగతిన అభివృద్ధి చెందే వనపర్తి పట్టణాభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలన్నారు గతంలో మీరు ఎలా పనిచేశారన్నది పక్కకు పెడితే నేటి నుంచి నిబద్ధతతో పనిచేయాలని, విధి నిర్వహణలో మీ దృష్టికి వచ్చే పొరపాట్లను నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన సూచించారు ముఖ్యంగా ఓటర్ లిస్ట్ పై ప్రత్యేక దృష్టి సారించి నిజమైన పట్టణ ఓటర్లను గుర్తించి, డబల్ ఎంట్రీలు ఉన్న వాటిని తొలగించాలని ఆయన సూచించారు పని విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం విజయవంతం చేద్దాం

**- జి సురేందర్**



**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:**

**జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతంగా జరుపుకుందామని బిహెచ్ఈఎల్ తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి సురేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నందున, మన గ్రహాన్ని రక్షించుకునే బాధ్యతను పునరుద్ఘాటిద్దాం. చెట్లను నాటడం, కాలుష్యాన్ని తగ్గించడం స్థిరమైన ఎంపికలు చేయడం ద్వారా, మనం పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణానికి దోహదపడుదామని, ప్లాస్టిక్ కాలుష్యం అనేది అత్యంత ముఖ్యమైన ఆందోళనలలో ఒకటని, సాధ్యమైన చోట ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను స్వీకరించాలని ప్రతిజ్ఞ చేద్దామని, మన సమాజంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా, మనకు భవిష్యత్తు తరాలకు పచ్చని స్థలాన్ని సృష్టిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వైపు అర్థవంతమైన చర్యలు తీసుకుందామని మెరుగైన రేపటిని నిర్ధారించుకుందామని పిలుపునిచ్చారు.**

# ఇరాన్‌లో కిడ్నాప్ అయిన భారత యువకులు క్షేమం

**ఇరాన్, సిటీ టైమ్స్**

ఇరాన్ లో గత నెల అదృశ్యమైన ముగ్గురు భారత యువకుల ఆచూకీ లభించింది. దుండగుల చెరలో ఉన్న బాధిత యువకులను టెహ్రాన్ పోలీసులు కాపాడి బయటకు తీసుకొచ్చారు. ఈ విషయాన్ని భారత్‌లోని ఇరాన్ ఎంబసీ 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించింది. పంజాబ్‌కు చెందిన సంప్రీత్, అమృత్‌పాల్, జస్పాల్.. ఉద్యోగాల కోసం ఏజెంట్ల సాయంతో దిల్లీ మీదుగా దంకీ ఆస్ట్రేలియాకు బయల్దేరారు. వారిని తీసుకువెళ్లిన ఏజెంట్లు తాత్కాలికంగా బస చేద్దామని నమ్మించి ఇరాన్ తీసుకెళ్లారు. అక్కడ వీరు కిడ్నాప్‌నకు గురైనట్లు బాధిత యువకుల కుటుంబ సభ్యులు పంజాబ్‌లోని అధికారులను ఆశ్రయించారు. విడుదల చేయాలంటే డబ్బు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో దీంతో పంజాబ్ ప్రభుత్వం ఈ విషయాన్ని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లింది. వారు సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే కేసు నమోదు చేసిన టెహ్రాన్ పోలీసులు యువకుల కోసం గాలింపు చేపట్టారు. దక్షిణ టెహ్రాన్‌లోని వెరామిన్ ప్రాంతంలో బందీలుగా ఉన్న వీరిని విడిపించారు. ప్రస్తుతం ఈ కేసును ఇరాన్ విదేశీ వ్యవహారాల శాఖలోని కాన్సులర్ విభాగం పరిశీలిస్తోందని, సంబంధిత న్యాయ అధికారులతో చర్చలు జరుపుతోందని ఎంబసీ పేర్కొంది. ఈ కేసు న్యాయ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు టెహ్రాన్‌లోని భారత ఎంబసీతో పంచుకుంటున్నట్లు తెలిపింది. మోసపూరిత వ్యక్తులు, అక్రమ ఏజెన్సీలు చెప్పే మాటలు నమ్మి ఉద్యోగాల కోసం చట్టవ్యతిరేక మార్గాల్లో ఇతర దేశాలకు రావొద్దని ఎంబసీ సూచించింది.



# వైభవంగా శ్రీ మరియమ్మ తల్లి బోనాల మహోత్సవం



**- ప్రత్యేక పూజలు చేసిన కోలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:**

శ్రీ మరియమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో వర్ధిల్లాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దేవేందర్ నగర్ లోని తమిళ్ బస్తి శ్రీ మరియమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి శ్రీ వీరభద్ర స్వామివారి బోనాలు



**- మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:**

శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి శ్రీ వీరభద్ర స్వామివారి బోనాల మహోత్సవంలో పాల్గొనడం తమ అదృష్టమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని రోడమేస్త్రి నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీ శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి, శ్రీ వీరభద్ర స్వామివారి బోనాల మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులతో అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ



**కార్పొరేటర్ గంగాధర్ చేతుల మీదుగా అందజేత**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదోడి లో గల జిహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయంలో అమెజాన్ కంపెనీ సహకారంతో సుమారు 200మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు బుధవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు నగర పరిశుభ్రత కోసం రోజూ తెల్లవారుజామున నుంచి కష్టపడుతున్నారు. వారివల్లే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయి. పారిశుధ్య కార్మికులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హనుమంత్ నాయక్, సుమన్, రాజు, శ్రీను, యాదయ్య, గోవిందు, జిహెచ్ఎంసీ సిబ్బంది భారత, కిస్తయ్య, మల్లేష్,,అమెజాన్ సంస్థ ప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాగులో మహిళ మృతదేహం మేడ్చల్‌లో దారుణ ఘటన

**మేడ్చల్, సిటీ టైమ్స్**

**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ హస్పెటల్ కు తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.**

# డ్రోన్లే ప్రధాన ఆయుధాలు

యుద్ధభూమిలో రూపాయి ఖర్చుపెట్టి శత్రువుకు 20వేల రూపాయల నష్టం కలుగజేయడం సాధ్యమవుతుందా? డ్రోన్ల యుగంలో అది సాధ్యమేనని మాస్కో నిరుడే నిరూపించింది. ఇరానియన్ డిజైన్ల ఆధారంగా సిద్ధంచేసుకున్న 'గూల్' ఆత్మాహుతి డ్రోన్లతో ఉక్రెయిన్‌కు అమెరికా అందజేసిన అబ్రమ్స్ యుద్ధట్యాంకులను రష్యా పడగొట్టింది. ఒక్కొక్కటీ పది మిలియన్ డాలర్ల(రూ.85.55 కోట్లు) ఖరీదైన ఈ ట్యాంకులను ఓడించిన 'గూల్' తయారీకి 500 డాలర్ల(సుమారు రూ.43వేల)కు మించి ఖర్చు కాదు. అంతే విలువైన 117 డ్రోన్లతో బాంబర్లు, ఎయిర్‌క్రాఫ్‌ట్‌లను నాశనం చేసి మాస్కోకు తాము 700 కోట్ల డాలర్ల నష్టం మిగిల్చినట్లు ఉక్రెయిన్ తాజాగా ప్రకటించింది.

నాలుగువేల కిలోమీటర్ల మేర రష్యా భూభాగంలోకి చొచ్చుకెళ్లి కీవ్ చేపట్టిన 'ఆపరేషన్ స్పైడర్ వెబ్'- సంప్రదాయ యుద్ధ వ్యూహాలకు కాలం చెల్లిందని, ఇకపై సమరాంగణంలో డ్రోన్లే ప్రధాన ఆయుధాలని చాటిచెప్పింది. సొంత బలం అంతగా లేని చిన్నదేశం... సాంకేతికత, అసమాన యుద్ధతంత్రాల(ఎసిమెట్రిక్ వార్‌ఫేర్) సాయంతో అమేయ సైనికశక్తి కలిగిన పెద్ద రాజ్యాన్ని చావుదెబ్బ తీయగలదని దీంతో నిరూపితమైంది. ఇటీవలే పాకిస్థాన్ డ్రోన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఇండియా మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఉక్రెయిన్ ఆపరేషన్ గుర్తుచేస్తోంది!

అన్ని రకాల వాతావరణాల్లో తక్కువ ఎత్తులో వేగంగా ఎగరగలిగే సైనిక డ్రోన్లు- శత్రు రాడార్ల కళ్లుగప్పి మరీ నిర్దేశిత లక్ష్యాలను ఛేదిస్తాయి. ఈ లోహ విహంగాలతోనే ఆర్మేనియాతో యుద్ధంలో ఆ దేశానికి చెందిన వంద బిలియన్ డాలర్ల విలువైన సైనిక సంపత్తిని అజర్‌బైజాన్ మసిచేసినట్లు కథనాలు వెలువడ్డాయి. సాయుధ డ్రోన్ల తయారీలో ఆరితేరిన తుర్కియేతో పాటు అజర్‌బైజాన్ కూడా పాకిస్థాన్‌కు వంతపాడుతోంది. వీటికితోడు దిల్లీపై దుగ్ధతో బీజింగ్ సైతం ఇస్లామాబాద్‌కు అండగా నిలుస్తోంది. ఈ పరిస్థితుల్లో భారతావనిని శత్రుదుర్భేద్యంగా మలచేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లు- సమగ్ర యాంటీ డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. 2024 మధ్యకాలం నాటికి మూడు వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి రెండున్నర వేల వరకు సైనిక డ్రోన్లను ఇండియా తన అమ్ములపొదిలోకి చేర్చుకుంది.

అయితే, అత్యాధునిక డ్రోన్ల తయారీలో పూర్తిగా స్వావలంబన సాధించడం జాతిభద్రత రీత్యా అత్యావశ్యకం!

నిఘా అవసరాలకోసం ఇండియా ప్రస్తుతం ఇజ్రాయెలీ హెరున్, సెర్చర్, డీఆర్‌డీవో రూపొందించిన రుస్తుం, తపస్-బీహెచ్-201 యూఏవీలను వినియోగిస్తోంది. నిర్దేశిత ప్రాంతంపై ఎగురుతూ లక్ష్యాన్ని గుర్తించి పేల్చేసే నాగాస్త్ర, వార్‌మేట్ డ్రోన్లూ అందుబాటులో ఉన్నాయి. మిస్సైళ్లు, బాంబులతో శత్రుస్థావరాలపై విరుచుకుపడే 'ఘాతక్'ను డీఆర్‌డీవో వర్గాలు అభివృద్ధి చేస్తున్నాయి. వైరిపక్ష రక్షణ వ్యవస్థలను విధ్వంసం చేసేందుకు సమన్వయంతో దూసుకెళ్లే డ్రోన్ల దండుకు దిశానిర్దేశం చేసే 'స్వార్మ్' సాంకేతికతపైనా ప్రయోగాలు జరుగుతున్నాయి.

తాము పయనించే మార్గంలోని దృశ్యాలను పైలట్లకు ప్రత్యక్షంగా ప్రసారం చేసే 'ఫస్ట్ పర్సన్ వ్యూ' డ్రోన్లను రష్యాపై దాడికి ఉక్రెయిన్ ఉపయోగించింది. అలాంటివి అయిదు మొన్న మార్చిలో మన సైన్యానికి అందాయని, రాబోయే రోజుల్లో వంద ఎఫ్‌పీవీలు సమకూరబోతున్నాయని అంటున్నారు. దేశాన్ని సురక్షితం చేసేందుకు ఇవన్నీ అక్కరకొస్తాయి కానీ, డ్రోన్లలో చైనీస్ విడిభాగాల వాడకంతో హ్యాకింగ్ ముప్పు పొంచిఉందన్న ఆందోళనలూ రేగుతున్నాయి.

# రష్యాకు తత్వం బోధపడాలి!

శాంతి సాధన కోసం తుర్కియేలో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య చర్చలకు 24 గంటల ముందు 'ఆపరేషన్ స్పైడర్స్ వెబ్' పేరిట ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించగలిగాయి. మరోవైపు రష్యా అంతకుముందూ, ఆ తర్వాతా ఉక్రెయిన్ నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇలా పరస్పర దాడుల నేపథ్యంలో సోమవారం జరిగిన చర్చలు సహజంగానే గంటన్నరలో ముగిశాయి.

కరచాలనాలు లేకుండా, కాల్పుల విరమణ ఊసెత్తకుండా యుద్ధఖైదీల మార్పిడిపై ఒప్పందం కుదుర్చుకుని రెండు బృందాలూ నిష్క్రమించాయి. అయిదు స్థావరాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రయత్నించిన మాట వాస్తవమే అయినా మూడు చోట్ల దాడుల్ని నిరోధించగలిగామని రష్యా చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా తమ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ వివరిస్తోంది. దానికి వేలకోట్ల నష్టం వాటిల్లిందని చెబుతోంది. రష్యా దాడుల పర్యవసానంగా ఈ మూడేళ్ల కాలంలో ఉక్రెయిన్ సైన్యం వేలాదిమందిని కోల్పోయింది. ఇలాంటి నష్టాలను పెద్ద దేశం కనుక రష్యా భర్తీ చేసుకోగలుగుతోంది. అందుకే నల్లసముద్రంలో రష్యా దూకుడును తగ్గించేందుకు ఉక్రెయిన్ పూర్తిస్థాయిలో డ్రోన్‌లను నమ్ముకున్నట్టు కనబడుతోంది. యుద్ధం మొదలైన తొమ్మిది నెలల తర్వాత ఉక్రెయిన్ తొలిసారి 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో దాడులు మొదలు పెట్టింది. ఈ మూడేళ్ల కాలంలో తన స్థావరాలు, ఇంధన డిపోలు, యుద్ధ విమానాల గోడౌన్లు పటిష్టం చేసుకోవటంలో రష్యా శ్రద్ధ పెట్టిన మాట నిజమే అయినా ఉక్రెయిన్ సైతం డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే పనిలోబడింది. ఆ విషయంలో అది విజయవంతమైందని ఆదివారంనాటి దాడులు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యర్థి దేశం తమతో పోలిస్తే పిపీలకమని, తమది అగ్రరాజ్యం, సంపన్న దేశమని మిడిసిపడే పరిస్థితి వర్తమాన కాలంలో ఎవరికీ లేదని ఉక్రెయిన్ దాడి వెల్లడిస్తోంది. యుద్ధం తప్పనిసరైనప్పుడు అందుకు అనుగుణంగా లోతైన అధ్యయనం చేసి, ఎప్పటికప్పుడు తనను తాను తీర్చిదిద్దుకున్న పక్షమే దీటుగా నిలబడగలుగుతుంది. ఉక్రెయిన్ ఆ పని చేయగలిగిందని ఈ ఉదంతం నిరూపిస్తోంది.

యుద్ధం ప్రారంభించిందీ, దాన్ని వద్దు వద్దని ఎంతమంది చెబుతున్నా వినకుండా కొనసాగిస్తున్నదీ రష్యాయే గనుక అది ప్రస్తుత నష్టానికి తనను తానే నిందించుకోవాలి. చర్చలు ప్రారంభమయ్యాకైనా గౌరవప్రదంగా కాల్పుల విరమణకు సిద్ధమై తన డిమాండ్లేమిటో చెబితే వాటిపై ఉక్రెయిన్ వైఖరేమిటో తేటతెల్లమయ్యేది. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడినా, నిలిచిపోయిన యుద్ధాన్ని తిరిగి కొనసాగనీయరాదన్న ఆత్రుత అందరిలో వుండేది.

అందువల్ల కొంత రాజీకి ఉక్రెయిన్‌ను ఒప్పించటానికి కూడా ప్రయత్నాలు సాగేవి. కానీ చర్చలకు ఒప్పుకున్నాక కాల్పుల విరమణ ఇంకా ఉనికిలోకి రాలేదన్న ఏకైక కారణంతో అది దాడుల్ని కొనసాగించింది. రష్యా దురాక్రమించిన భూభాగమంతా వెనక్కిస్తే తప్ప యుద్ధ విరమణ ఉండబోదని మొన్న జనవరి నెలాఖరున ఉక్రెయిన్ చెప్పటంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి ఇకపై అమెరికా నిఘా సమాచారం అందబోదని ప్రకటించారు.

తాజా దాడులు గమనిస్తే ఉక్రెయిన్ ఆ అవరోధాన్ని కూడా అధిగమించగలిగిందని అర్థమవుతుంది. పైగా రష్యా గడ్డపైకి ట్రక్కుల్లో డ్రోన్లు తీసుకెళ్లి, లక్ష్యాలను చేరుకోగానే అవి ఒక్కసారిగా ఎగిరి యుద్ధ విమానాలను ధ్వంసం చేసేలా పథకం రచించింది.

ఈ పరిణామానికి రష్యా ఎటూ ఆందోళన పడుతుంది. కానీ పాశ్చాత్య దేశాలు సైతం కంగారు పడక తప్పదు. ఎందుకంటే ఎవరి నిఘా సాయమూ లేకుండా చవగ్గా లభించే డ్రోన్లతో రష్యావంటి దేశంలో పెనువిధ్వంసం సృష్టించగలగటం మాటలు కాదు. తమ పొరుగునే వుండి, తమ ప్రోత్సాహంతో రష్యాను చీకాకు పర్చటానికి ముందుకొచ్చిన చిన్న దేశం సైనికంగా ఇంత పటిష్టం కావటం పాశ్చాత్య దేశాలు జీర్ణించుకోలేనిది.

2014 మొదట్లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వుండిన విక్టర్ యెనుకోవిచ్ తమ కీలుబొమ్మ కాలేదని అతన్ని కుట్రపూరితంగా పడగొట్టి జెలెన్‌స్కీని ప్రతిష్ఠించింది పాశ్చాత్య దేశాలే. అందుకు అమెరికా సైతం దన్నుగా నిలబడింది. నాటోను తూర్పువైపు విస్తరించాలన్న ఆ దేశాల దురాలోచనే ఇందుకు కారణమని గ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ దురాక్రమణకు తెరతీశారు.

డ్రోన్ దాడుల్లో రష్యా కోల్పోయిన యుద్ధ విమానాలు టియూ-95, టియూ-160 విమానాలు. అవి క్రూయిజ్ క్షిపణుల్ని ప్రయోగించగల సామర్థ్యం వున్నవి. ఉక్రెయిన్ చెబుతున్నదే నిజమైతే రష్యా వైమానిక పాటవం 34 శాతం కోల్పోయిందని సైనిక నిపుణుల అంచనా. వీటిని తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్ల వ్యయమవుతుంది.

రష్యాకు తత్వం బోధపడినట్టేనా? తమ దాడులతోపాటు పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షల తీవ్రతను పెంచాలన్నది జెలెన్‌స్కీ వాదన. కానీ అమెరికా కనుసన్నల్లో నడిచే ఆ దేశాలు అందుకు సిద్ధపడలేవు. యుద్ధాన్ని ప్రారంభించటం సులభమే, కొనసాగించటమూ పెద్ద కష్టం కాదు. కానీ ముగించటం అత్యంత క్లిష్టమైనది. ఇరుపక్షాలకూ అప్పటికే యుద్ధం ప్రతిష్టాత్మకంగా మారిపోతుంది. విరమణకు సిద్ధపడితే దేశాన్ని పాదాక్రాంతం చేశారన్న అపఖ్యాతి వస్తుంది. అలాంటి అవమానాన్ని దిగమింగటానికి జెలెన్‌స్కీ సిద్ధంగా వున్నా పుతిన్ ససేమిరా అనటమే ప్రస్తుత సమస్య. ఇప్పటికే ఎంతో జాప్యం జరిగింది. కనుక ఈ యుద్ధం ఆపటానికి ప్రపంచ దేశాలు ప్రయత్నించాలి. తగిన హామీలిచ్చి పుతిన్‌ను ఒప్పించాలి.

# భద్రంగా బడికి... సంతోషంగా ఇంటికి!

సెలవుల తరవాత బడులన్నీ చిన్నారుల ఆటపాటలతో ఎంతో సంబరంగా కనిపిస్తాయి. బాలల వికాసానికీ, భవిష్యత్తుకూ పసిడి బాటలు పడేది అక్కడే. అలాంటి ప్రాంగణాలకు పిల్లలు భద్రంగా వెళ్లి రాగలిగితేనే బాల్యానికి భరోసా ఉంటుంది. అందుకనే, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) పాఠశాల భద్రతను 'ఇంటి నుంచి బడికి బడి నుంచి ఇంటికి' అనే దృక్కోణంలో చూడాలని చెబుతోంది.

పిల్లలను పొద్దున్నే సిద్ధంచేసి బడిలో దింపిరావడం మొదలు... వారు మళ్లీ క్షేమంగా ఇంటికి తిరిగొచ్చేంత వరకు తల్లిదండ్రులకు ఆరాటం తప్పడంలేదు. బడి పిల్లలు రాకపోకలప్పుడు వచ్చిపోయే వాహనాలతో పాటు కొన్నిచోట్ల వాగులు, కాల్వలు, పొదలు వంటి వాటిని దాటాల్సి వస్తోంది. దారిలో తెగిపడిన విద్యుత్ తీగలు, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటున్నాయి. దేశంలో అనేక చోట్ల బడికి వెళ్లే పిల్లలు దారిలో ఇతరుల నుంచి దుర్భాషలు, లైంగిక వేధింపులు, దోపిడీలకు గురవుతున్నారు. బస్సుల్లోనూ అసభ్య ప్రవర్తన, వేధింపులు తప్పడం లేదు వారికి. గుజరాత్‌లో 2001 జనవరి 26న భూకంపం సంభవించినప్పుడు కచ్ జిల్లాలో రిపబ్లిక్ డే ర్యాలీలో పాల్గొన్నవారిలో సుమారు 400 మంది పిల్లలు మృత్యువాత పడ్డారు. 2004లో కుంభకోణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 94మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 2017లో ఉత్తరాదిలో వచ్చిన వరదల్లో సుమారు 18వేల పాఠశాలలు చిక్కుకుపోయాయి. అదే ఏడాదిలో ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఒక విద్యార్థి హత్యకు గురయ్యాడు. ఇలా విపత్తులు, వేధింపులు, పరిస్థితుల రూపంలో ముంచుకొస్తున్న ప్రమాదాలు చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తున్నాయి. వీటి నుంచి బాలబాలికలకు రక్షణ, భద్రత కల్పించడం అత్యావశ్యకం.

'పాఠశాల భద్రత'పై అవగాహన కల్పించడంతో పాటు ఆపద నుంచి తమను తాము కాపాడుకునే నైపుణ్యాలను విద్యార్థులు, సిబ్బందికి అలవర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పాఠశాలల యాజమాన్యాలపై ఉంది. చిన్న తరగతుల విద్యార్థులు మొదలు అందరికీ ఇటువంటి జాగ్రత్తలను మప్పాలి. పిల్లలు బడిలో, బడి బయట చవిచూస్తున్న సమస్యలతో పాటు వాటిని ఎలా ఎదుర్కోవాలి, రక్షణకు సంబంధించినవైతే ఎవరిని సంప్రదించాలనే విషయమై పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులకు అవగాహన తప్పనిసరి. బడి పిల్లల సమస్యలను మానవ తప్పిదాలు, ప్రకృతి వైపరీత్యాలు, రోజూ ఎదురయ్యే ఇక్కట్లుగా విభజించాలి. వాటికి ఎలా స్పందించాలనేది మాక్ డ్రిల్స్ ద్వారా విద్యార్థులతో సాధన చేయించాలి. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ, సేవ్ ది చిల్డ్రన్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం కలిసి చక్కని కార్యాచరణతో పాటు పాఠశాల స్థాయిలో భద్రతా ప్రణాళికలను రూపొందించడం విశేషం. పాఠశాలలో, బయట ఉండే సురక్షిత వాతావరణం చిన్నారుల మనో వికాసానికి అత్యంత కీలకం. అందుకోసమే, బడి పిల్లల భద్రతకు సంబంధించి జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ 2016లోనే రాష్ట్రాలకు మార్గదర్శకాలను జారీచేసింది. పిల్లలు ఇంటి నుంచి బయల్దేరినప్పటి నుంచి, బడి నుంచి తిరిగి ఇంటికి వచ్చేవరకు భద్రతను పర్యవేక్షించడం అందరి బాధ్యతని పేర్కొంది. పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యా, పోలీస్, ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ, రవాణా తదితర శాఖలు కలసికట్టుగా పిల్లల రక్షణకు గట్టి ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇందుకు రాష్ట్రాలు తగిన ప్రణాళికలను సిద్ధంచేసి, వాటి అమలుకు ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటు చేయాలనీ నిర్దేశించింది.

పాఠశాల భద్రత ప్రధాన లక్ష్యం ప్రాణ నష్టం సంభవించకుండా, పిల్లల చదువులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చూడటం. వరదలు, వ్యాధులు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు పిల్లలు సహజంగానే భయభ్రాంతులకు గురవుతారు. అటువంటి పరిస్థితుల్లో ఆందోళనకు గురికాకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. మరోవైపు విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాలలు, స్థానిక సంస్థలు,

సమాజం శ్రద్ధ వహించాలి. జాతీయ చిన్నారుల విధానం2013 కూడా పిల్లల భద్రతను ప్రాధాన్యాంశంగా పేర్కొంది. ప్రభుత్వ సేవలు వారికి నిష్పాక్షికంగా అందాలనీ, స్వేచ్ఛాయుత వాతావరణంలో వారు వికసించాలని ఆకాంక్షించింది.

# వీరి ఆటతీరే కాదు.. మాటతీరూ అదుర్స్!




**ఐపీఎల్ 2025 సీజన్ ముగిసింది. 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత 18వ సీజన్‌లో ఆర్సీబీ విజేతగా నిలిచింది. అయితే ఈ ఐపీఎల్ మెగా టోర్నీలో పలువురు ఆటగాళ్లు తమ ఆట తీరుతోనే కాకుండా.. మాట తీరుతోనూ ఆకట్టుకున్నారు. తాము స్ఫూర్తి పొందుతూ.. ఇతరుల్లోనూ ప్రేరణ కలిగించే ప్రయత్నం చేశారు. వాటిలో కొన్ని వ్యాఖ్యల మీద ఓ లుక్కేద్దామా!**

### ఒకప్పుడు కష్టం.. ఇప్పుడు సులభం!

'నేను గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సన్నద్ధమవుతున్నాను. దాని ఫలితాలను కూడా చూశా. ఒకప్పుడు కష్టంగా అనిపించిన విషయాలన్నీ ఇప్పుడు సులభంగా మారాయి. దృష్టి కేంద్రీకరించడం ముఖ్యమని నేను గ్రహించాను. జట్టుకు అవసరమైన మేరకు మాత్రమే ఆడాలి. ఈ స్థాయిలో అవసరం లేని పనులు చేయడానికి అస్సలు ప్రయత్నించకూడదు' అని టీనేజ్ థండర్, రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తాను ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ మీద 35 బంతుల్లోనే సెంచరీ చేసిన అనంతరం అన్నాడు.

### వర్తమానంలో ఉంటాను!

'ఫైనల్‌లో ఆర్సీబీ లాంటి జట్టుకు నాయకత్వం వహిస్తున్నప్పుడు సహజంగానే ఎన్నో అంచనాలుంటాయి. కానీ, నేను ఎల్లప్పుడూ నా నియంత్రణలో ఉన్న వాటిపైనే దృష్టి సారిస్తాను. వర్తమానంలో ఉండటానికి ప్రయత్నిస్తాను. ఈ కెప్టెన్సీ ప్రయాణం నాకు గొప్ప అనుభవం. కొంతమంది అత్యుత్తమ కెప్టెన్‌లు, విదేశీ ఆటగాళ్లతో కలిసి ఆడటం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ప్రశాంతమైన, సురక్షితమైన జట్టు వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టిసారించాను. మా జట్టులో దేశవాళీ ప్లేయర్‌స్‌తోపాటు అంతర్జాతీయ ఆటగాళ్లు ఆత్మవిశ్వాసంతో ఉంటారు' అని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ ఐపీఎల్ ఫైనల్‌కు ముందు అన్నాడు.

### పసిపాపలా నిద్ర పోతాను!

'ఆర్సీబీ జట్టుకు నా యవ్వనం, శక్తి, ఉత్సాహం, అనుభవం ఇచ్చా. ప్రతి సీజన్‌లో గెలవడానికి ప్రయత్నించా. ఈరోజు వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. గెలిచిన తర్వాత భావోద్వేగంలో మునిగిపోయాను. ఇది చాలా ఇంటెన్సిటీ ఉన్న టోర్నమెంట్. ఇక ఈ రాత్రి, నేను పసిపిల్లాడిలా హాయిగా నిద్రపోతాను' అని విరాట్ కోహ్లీ ఐపీఎల్ టోర్నీ గెలిచిన అనంతరం అన్నాడు.

### మానసికంగా మెరుగయ్యా

'బ్యాటర్‌గా నాలో పెద్దగా మార్పు రాలేదని నేను అనుకుంటున్నాను. కానీ మానసికంగా నేను మెరుగుపడ్డాను. దిగ్గజ ఆటగాళ్లతో పోటీ పడటం ఎప్పుడూ గొప్పగా అనిపిస్తుంది. దీన్ని నేను ఆస్వాదిస్తున్నా. కానీ జట్టుకు ఉత్తమ సేవలు అందించడమే నా ప్రథమ ప్రాధాన్యం' అని ఈ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయిసుదర్శన్ అన్నాడు.

### క్రికెట్ చాలా త్యాగాలను కోరుకుంటుంది

'నా ఆట, ఆలోచనలు, సామర్థ్యాలపై నాకు చాలా నమ్మకం ఉంది. అంతిమంగా, నా కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడం నా బాధ్యత. నేను ఎంత కష్టపడి పని చేయాలో నాకు తెలుసు. క్రికెట్ చాలా త్యాగాలను కోరుతుంది. కానీ మీరు ఏదైనా సాధించినప్పుడు లేదా బాగా రాణించినప్పుడు మాత్రమే ప్రజలు వాటిని గమనిస్తారు. నాకు, నేను విజయం సాధించాలనుకుంటే, నేను ప్రతి అంశంలోనూ కష్టపడి పనిచేయాలి. మీరు పగలు, రాత్రి అలుపెరగకుండా ప్రయత్నం చేసినప్పుడు ఫలితాలు వస్తాయి. నా మీద నేను నమ్మకం ఉంచుకోవడం పైనే ఎప్పుడూ నా దృష్టిని పెడతాను' అని రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ అన్నాడు.

## ఆర్సీబీకి రూ.20 కోట్లు, పంజాబ్ కింగ్స్‌కు రూ.12.5 కోట్లు!

ఐపీఎల్ 2025 ట్రోఫీని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రైజ్ మనీగా 20కోట్ల రూపాయలను సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ 12.5 కోట్ల రూపాయలు పొందింది. ఆర్సీబీకి ఇదే తొలి ఐపీఎల్ టైటిల్ కావడం గమనార్హం. గతంలో ఈ టీమ్ 2009, 2011, 2016లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ చివర్లో బోల్తా పడింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ.. బెంగళూరు జట్టు ఐపీఎల్ 2025 ట్రోఫీని కైవసం చేసుకుంది. క్వాలిఫయర్ 2లో ఓడిపోయి, మూడో స్థానంలో నిలిచిన ముంబయి ఇండియన్స్ జట్టుకు రూ.7 కోట్లు దక్కాయి. ఎలిమినేటర్‌లో పరాజయం పాలై, నాలుగో స్థానానికి పరిమితమైన గుజరాత్ టైటాన్స్ రూ.6.5 కోట్లు తమ ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు 2008 సీజన్‌లో ప్రైజ్‌మనీ రూ.4.8 కోట్లుగా ఉండేది. రన్నరప్‌నకు 2.4 కోట్లు దక్కేవి. అప్పటి నుంచి క్రమంగా ప్రైజ్‌మనీ పెరుగుతూ వస్తోంది.

**దిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కూ అవార్డు**

'బెస్ట్ పిచ్ అండ్ గ్రౌండ్' అవార్డును దిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సొంతం చేసుకుంది. డీడీసీఏ రూ.50 లక్షలు గెలుచుకుంది. ఈ సీజన్‌లో అరుణ్‌జైట్లీ స్టేడియంలో ఏడు ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగాయి. 'ఈ అవార్డు మా క్యూరేటర్లు, సిబ్బంది, యాజమాన్యం అవిశ్రాంత కృషికి నిదర్శనం. క్రికెట్ మౌలిక సదుపాయాల్లో అత్యున్నత ప్రమాణాలు కొనసాగించడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సందర్భంగా అన్నాడు.

**ఎవరెవరు.. ఎంత గెలుచుకున్నారంటే..**

అత్యధిక పరుగుల వీరుడిగా ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయిసుదర్శన్ (759 రన్స్), అత్యధిక వికెట్ల వీరుడిగా నిలిచి, పర్పుల్ క్యాప్ సాధించిన ప్రసిద్ధ్‌కృష్ణ (25 వికెట్లు) చెరో రూ.10 లక్షలు గెలుచుకున్నారు. ఎమర్జింగ్ ప్లేయర్‌గా సాయి సుదర్శన్ మరో రూ.10 లక్షలు, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా సూర్యకుమార్ యాదవ్ రూ.15లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచిన వైభవ్ సూర్యవంశీ రూ.10 లక్షలతో పాటు, కారు, బెస్ట్ క్యాచ్ విన్నర్‌గా నిలిచిన కమిందు మెండిస్ రూ.10 లక్షలు, మోస్ట్ డాట్ బాల్స్ సంధించిన మహ్మద్ సిరాజ్ రూ.10 లక్షలు గెలుచుకున్నారు.

## పెట్టని కోటలా.. ఆర్సీబీ 12th మెన్ ఆర్మీ..!

'ఈ సలా కప్ నమదే'.. ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే చాలు ఆర్సీబీ (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) ఫ్యాన్స్ ఈ నినాదంతో చేసే సందడితో ఇంటర్నెట్ హోరెత్తిపోతుంది. దాదాపు 17 సీజన్లుగా .. ఏటా తమ జట్టు విజయం సాధించాలని నిర్విరామంగా ఉత్సాహపర్చారు. ఈ క్రమంలో లెక్కలేనన్నిసార్లు వారి హృదయాలు బద్దలయ్యాయి. కానీ, ఏ దశలోనూ వారు జట్టును వీడలేదు. దృఢంగా..భావోద్వేగాలతో.. ఆశావాదంతో కష్టకాలంలోను జట్టును అంటిపెట్టుకొని ఆటగాళ్లలో జోష్ నింపారు. ఆర్సీబీకి 12th మెన్ ఆర్మీగా నిలిచారు. ఐపీఎల్‌లో అత్యధిక ఫాలోయింగ్ ఉన్న జట్లలో ఒకటిగా నిలిచింది. దీంతో వీరి ఆశలు ఫలించి 18వ సీజన్‌లో 'ఈ సలా కప్ నమదు'గా మారింది. 2008లో యునైటెడ్ స్పిరిట్స్ యాజమాన్యంలో ఈ జట్టు ఏర్పడింది. దీనిలో ఈ జట్టుతో కలిసి అనిల్ కుంబ్లే, విరాట్, ఏబీ డివిలియర్స్, గేల్, డూప్లిసెస్ ఆడారు. అయినా, ఒక్క ఐపీఎల్ టైటిల్ సాధించలేదు. 2009, 2011, 2016 ఫైనల్స్‌కు చేరినా.. అదృష్టం వెక్కిరించింది. కానీ, జట్టు ఫ్యాన్స్‌ను కలిపి ఉంచిన నినాదం 'ఈ సలా కప్ నమదే'. ప్రత్యర్థి జట్ల ఫ్యాన్స్‌కు ఇది మీమ్ మెటీరియల్‌గా మారినా అభిమానుల ఆశలు చెక్కుచెదరలేదు. బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ ఆర్సీబీకి పెద్ద ఫ్యాన్. తమ అభిమాన జట్టు ఫైనల్స్‌కు చేరడంతో.. ఈ బెంగళూరు అల్లుడు లండన్ నుంచి సతీసమేతంగా రెక్కలు కట్టుకొని భారత్‌లో వాలిపోయారు.

ఈ జట్టు ఫ్యాన్స్ అభిమానానికి పెద్దపెద్ద క్రికెట్ స్టార్లు ఫిదా అయిపోయారు. క్రిస్ గేల్ ఆర్సీబీ తరఫున విధ్వంసం సృష్టించాడు. ఈ జట్టు తరఫున ఐపీఎల్‌లో అత్యధిక స్కోర్ (175) సాధించాడు. రిటైర్మెంట్ తరవాత కూడా ఆర్సీబీ తరఫునే ఎక్కువగా మైదానంలో కనిపిస్తుంటాడు. ఇక మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్ మద్దతుదారుగా కొనసాగుతున్నాడు. ఇక విరాట్ సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన ఐపీఎల్ కెరీర్‌ను ఈ జట్టులోనే ప్రారంభించి.. ఇప్పటికీ కొనసాగుతున్నాడు. "18 ఏళ్లుగా నా సర్వస్వం జట్టుకు ధారపోశాను. టీమ్‌పై పూర్తి విశ్వాసంతో కొనసాగాను. ప్రతి దశలో పరస్పరం ప్రోత్సహించుకొంటూ ముందుకునడిచాం. ఈ విజయం నా కల. నా హృదయం బెంగళూరుకు సొంతం. నేను చివరివరకు ఆర్సీబీకే ఆడతాను. ఈ రోజు రాత్రి పసిబిడ్డలా నిద్రపోతా" అంటూ భావోద్వేగానికి గురయ్యాడు.

## ఈ ట్రోఫీకి అందరికంటే ఎక్కువ అర్హుడు కోహ్లీనే: రజత్ పటీదార్




18 ఏళ్ల నిరీక్షణ అనంతరం ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు . ఈసారి కొత్త కెప్టెన్‌గా వచ్చిన రజత్ పటీదార్ .. ఆ జట్టు చిరకాల స్వప్నాన్ని సాకారం చేశాడు. దీంతో ఆర్సీబీ అభిమానులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

ఇక జట్టు విజయంపై రజత్ పటీదార్ మాట్లాడుతూ.. విరాట్ కోహ్లీ ని ఆకాశానికెత్తాడు. ఇది తనకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నాడు. "విరాట్ కోహ్లీ నుంచి నేర్చుకోవడానికి ఇది నాకు లభించిన గొప్ప అవకాశం. ఐపీఎల్‌లో ఈ ట్రోఫీని పొందడానికి ఇతరుల కంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ అర్హుడు. ఎందుకంటే 18 సీజన్లుగా ఒకే ఫ్రాంచైజీకి అతడు ఆడుతున్నాడు" అని పటీదార్ అన్నాడు.

"ఈ విజయం నాకు, విరాట్ కోహ్లీకి, మా జట్టు అభిమానులకు నిజంగా ఎంతో ప్రత్యేకం. అభిమానులు మాకు సంవత్సరాలుగా మద్దతు ఇస్తున్నారు. ఇక స్లో పిచ్‌పై 190 పరుగులు కూడా మంచి స్కోరే. ఓ సమయంలో ఈ పిచ్‌పై మా బ్యాటర్లు పరుగులు త్వరగా ఎందుకు చేయడం లేదన్న ప్రశ్నలు వచ్చాయి. అయితే.. ఆ తర్వాత పంజాబ్ కూడా ఈ పిచ్‌పై ఇబ్బంది పడింది. మా బౌలర్లు జట్టు ప్రణాళికలను చక్కగా అమలు చేశారు" అని పటీదార్ తెలిపాడు. ఇక రెండు వికెట్లు తీసి పంజాబ్‌ను నిలువరించిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కృనాల్ పాండ్య బౌలింగ్‌పై కూడా పటీదార్ ప్రశంసల వర్షం కురిపించాడు.

# ప్రశాంతంగా ముగిసిన జీహెచ్ఎంసీ 11వ సర్వ సభ్య సమావేశం

**- పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపిన సభ్యులు-**

హైదరాబాద్, జూన్ 04(సిటీ టైమ్స్):



నగర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ 11వ సాధారణ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో పాకిస్తాన్ టెర్రరిస్టులు అమాయక ప్రజలను పహల్గాం లో కిరాతకంగా చంపిన సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దాడిలో మరణించిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

సభ ప్రారంభానికి ముందు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ... జీహెచ్ఎంసీలో చేపట్టే మౌలిక సదుపాయాల అభివృద్ధికి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన మేరకు గౌరవ ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తూ బల్దియా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తావించారు. నగర ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అన్నారు. అందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. నగరంలో ముందస్తు మాన్సూన్ శానిటేషన్ డ్రైవ్ వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి గల్లీని పరిశుభ్రం చేయడమే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పరిశుభ్రమైన నగరంగా ఉండేందుకు దోహద పడుతుందని, అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు గౌ.ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్లమెంటు సభ్యులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని అధికారులను కోరారు. నగరంలో ప్రజా సమస్యలను పరిష్కరించుటకు జోనల్ వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, ముందుగా ఎల్బీనగర్ జోన్ లో నిర్వహించి ఆ సమావేశంలో కార్పొరేటర్లు అడిగిన సమస్యల పరిష్కారం కోసం తగు నిర్ణాయలు తీసుకున్నట్లు తెలిపారు. మిగతా జోన్ లలో కూడా శానిటేషన్, డిసిల్టింగ్, నాలా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసేందుకు అధికారులతో కార్పొరేటర్లు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ వివరించారు.

మొఘల్ పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ప్రభుత్వ కార్యాలయం ఉన్నందున క్రీడలకు అంతరాయం ఏర్పడుతుందని, క్రీడాకారులు తయారు కావడానికి కార్యాలయాన్ని వెంటనే అక్కడి నుండి తొలగించాలని సయ్యద్ సోహెల్ ఖాద్రీ కోరారు. ఈ విషయం పై కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మెటీరియల్ ను, సమ్మర్ కోచింగ్ లో కాకుండా ముందస్తుగా ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ మాట్లాడుతూ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నందున యువత .... అంబర్ పేట్ కార్పొరేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ... అంబర్ పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కోచ్ లేదని తెలిపారు. వనస్థలిపురం ప్రభుత్వ ప్లే గ్రౌండ్ లో ప్రైవేట్ వ్యక్తులు స్కేటింగ్ రుసుం వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతంలో పేద వాళ్లు ఎక్కువగా ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్లను స్థానిక ప్రదేశంలో ఇవ్వాలని, దూర ప్రదేశంలో ఇవ్వవద్దని తెలిపారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో మౌలిక వసతులు సరిగా లేవని తెలిపారు. అందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని తెలిపారు. నగరంలో ఏర్పడే కొత్త కాలనీలలో భవిష్యత్తు ప్రణాళికతో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఎస్.ఎన్.డి.పి ద్వారా నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని, పార్కు స్థలాలను కాపాడాలని, జలమండలి, జీహెచ్ఎంసి సమన్వయంతో వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైల్వే లైన్ల ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి అండర్ పాస్ ల నిర్మాణానికి రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కంట్రిబ్యూషన్ లేకుండా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. బొల్లారం వద్ద నిధులు మంజూరై ఇప్పటికి 20 ఏళ్లు అయినా ఇంకా ప్రారంభించలేదని అన్నారు. నగరంలో ఆఫీస్ లో కంటే ట్రాఫిక్ లో ఇబ్బందుల పడుతున్నారని తెలిపారు.

ఈ సమావేశంలో జపాన్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమావేశం పూర్తయ్యే వరకు వారు సభ తీరును పరిశీలించారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, శానిటేషన్, బర్త్ అండ్ డెత్, వీధి లైట్లు, అడ్వర్టైజ్మెంట్, డిసిల్టింగ్ తదితర అంశాలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయా విభాగాల అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు విజయశాంతి, బల్మూరి వెంకట్, మిర్జా రియాజ్ ఉల్ హస్సన ఎఫెంది, మిర్జా రహమత్ బేగ్, అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు జుల్ఫికర్ అలీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమీషనర్లు స్నేహ శబరీష్, వేణుగోపాల్, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, సుభద్ర, మెయింటెనెన్స్ సి.ఇ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్ట్ సి.ఈ భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహదేవ్ రావు, రవికిరణ్, వెంకన్న, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నగరంలోని ఫ్లైఓవర్లకు ఉర్దూ బాషలో బోర్డులు పెట్టాలి: ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్

రాష్ట్రంలో రెండో అధికార భాష ఉర్దూ ఉన్నందున అధికారులు నగరంలోని కొన్ని ఫ్లైఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టడంలేదని ఆయన తెలిపారు. వెంటనే ఫ్లైఓవర్లకు ఉర్దూ భాషలో పేర్లు పెట్టాలని ఆయన కోరారు.

### మొట్టమొదటి సారిగా సమావేశానికి అధ్యక్షత గా వ్యవహరించిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

మొట్టమొదటి సారిగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె బర్త్ అండ్ డెత్ అంశం పై సమర్థవంతంగా చర్చ నిర్వహించారు. సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధికారులతో సమాధానం ఇప్పించారు. టీ బ్రేక్ అనంతరం తిరిగి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షత వహించి సమావేశానికి కొనసాగించారు.





# జర్నలిస్టులకు ఉచిత ఓపి సేవలు అందించండి



**- IMA జిల్లా అధ్యక్షుడిని కోరిన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు.**
**- వైద్య పరీక్షలతో పాటు మెడిసిన్ లో రాయితికై విజ్ఞప్తి.**
**-సానుకూలంగా స్పందించిన అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబు.**

కొత్తకోట సిటీ టైమ్స్ జూన్ 4

జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు, జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత OP సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబు ను కొత్తకోటలోని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.... ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలను అందించి సహకరించాలని కోరారు. సమాజ హితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు IMA తరపున సహకారం అందించి సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో జర్నలిస్టులకు, జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత ఓపి సేవలు అందించడంతోపాటు వైద్య పరీక్షలలో 50 శాతం, మందుల కొనుగోలుపై 25% రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన IMA జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబు త్వరలోనే జిల్లాలోని వైద్యులతో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని ఉచిత ఓపి సేవలతో పాటు రాయితీల వంటి జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తామన్నారు. అంతేకాకుండా జర్నలిస్టులకు IMA తరపున హెల్త్ కార్డులు ఇచ్చే విధంగా ప్రత్యేక కార్యక్రమం రూపొందిస్తామని తెలిపారు. త్వరలోనే జిల్లా జర్నలిస్టులతో ఒక ప్రత్యేక సమావేశం కూడా ఏర్పాటు చేసుకుందామన్నారు. జిల్లా జర్నలిస్టుల తరపున IMA వైద్య బృందానికి వనపర్తి ప్రెస్ క్లబ్ (కమిటీ) తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు బోలేమోని రమేష్, కొండన్న యాదవ్, బొడ్డుపల్లి లక్ష్మణ్, ఖలీల్, యాదిరెడ్డి, గంధం దినేష్, కుమార్, తిరుపతి, శ్రీనాథ్, మల్లికార్జున్, పురుషోత్తం, తరుణ్, గోపాలకృష్ణ, రవికుమార్, రాజు, రాజ్ కుమార్, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బీ ఆర్ ఎస్ గుడ్ బై చెప్పి...



**- కాంగ్రెస్ పార్టీలో చేరిన పెబ్బేరు గులాబీ పార్టీ శ్రేణులు**
**- ఎమ్మెల్యే మెగా రెడ్డి సమక్షంలో హస్తం గూటికి బీ ఆర్ ఎస్ కార్యకర్తలు...**
**- నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని పిలుపు ఎమ్మెల్యే పిలుపు..**

నపర్తి బ్యూరో సిటీ టైమ్స్ జూన్04

పెబ్బేరు పట్టణానికి చెందిన పలువురు గులాబీ పార్టీ నాయకులు కార్యకర్తలు బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పెబ్బేరు పట్టణం 1వ వార్డుకు చెందిన దాదాపు 30మంది పార్టీ శ్రేణులు, మహిళలు బుధవారం కాంగ్రెస్ నాయకులు గంధం ఉత్తంకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మహిళాభివృద్ధికి, నిరుపేదల అభ్యున్నతికి పాటుపడి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులమై నేడు పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు గంధం రాజశేఖర్, దయాకర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, సురేందర్ గౌడ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు



# టెట్ ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సిటీ టైమ్స్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) 2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ ) పద్ధతిలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉ.9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి టెట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి ఎగ్జామ్ షెడ్యూల్ కోసం టెట్ వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.

# జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు కృషి చేస్తా








**- జిల్లా హెల్త్ కన్వీనర్ గా ఎన్నికైన గంధం దినేష్..**
**- గత ఐదేళ్లుగా జిల్లా జర్నలిస్టులకు సేవలు.**
**- ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు.**

వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ జూన్ 4 :

వనపర్తి జిల్లా ప్రెస్ క్లబ్ కమిటీ బుధవారం కొత్తకోట లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ కమిటీ సమావేశంలో జిల్లా హెల్త్ కన్వీనర్ గా గంధం దినేష్ ను ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గంధం దినేష్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరికి కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. గత ఐదేళ్లుగా జిల్లాలోని జర్నలిస్టులకు వైద్యపరమైనటువంటి సేవలు అందించాననీ,భవిష్యత్తులో కూడా జిల్లా జర్నలిస్టులకు వైద్యపరమైనటువంటి సేవలు మరింత అందిస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా హెల్త్ కన్వీనర్ గా అవకాశం కల్పించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కమిటీ సభ్యులు బొలేమోని రమేష్,కొండన్న యాదవ్,బొడ్డుపల్లి లక్ష్మణ్,రాములు,రవి కుమార్, మహమ్మద్ ఖలీల్,యాదిరెడ్డి,రవి,శ్రీనాథ్, తిరుపతి, మల్లికార్జున్,గోపాలకృష్ణ,పురుషోత్తం పాల్గొ న్నారు.

# ఏడుగురు సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, సిటీ టైమ్స్

తెలంగాణలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, మహిళా భద్రత విభాగం, సీఐడీ అదనపు డీజీగా చారు సిన్హా, ఎఫ్ఎస్ఎల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా కొనసాగనున్న శిఖా గోయల్, చార్మినార్ రేంజ్ డీఐజీగా తఫ్సీర్ ఇక్బాల్, మెదక్ ఎస్పీగా డీవీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా చైతన్యకుమార్ బదిలీ అయ్యారు.

# జూనియర్ కళాశాలను సందర్శించి పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



- కళాశాల అభివృద్ధిపై పట్టింపు లేని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే...
- సమస్యలపై అధ్యాపకులతో ఆరా...
- సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచన...
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన ఎమ్మెల్యే...

వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ జూన్ 04

వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సందర్శించి పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాల అధ్యాపకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు కళాశాల పూర్తిగా శిథిలావస్థకు చేరిందనీ, తరగతి గదులు మరుగుదొడ్లు, ల్యాబ్ గదులు, కంప్యూటర్ ల్యాబ్ గదులు, పూర్తిగా శిథిలమైపోయాయని, నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మౌలిక వసతులు కల్పిస్తే నూతన భవనాలు నిర్మించే వరకు విద్యాభ్యాసాన్ని ఇక్కడే కొనసాగిస్తామని అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో కళాశాలలోని ప్రతి సమస్యను పరిష్కరించాలని అందుకు కావలసిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు మార్చు 2వ తేదీన ఇక్కడ అధునాతన హంగులతో నూతన విద్యాలయాల నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని అతి త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వినోద్ కుమార్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్, మున్సిపల్ శాఖ DE, AE, కళాశాల అధ్యాపకులు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు











# అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి

హైదరాబాద్, సిటీ టైమ్స్

గుల్జార్ హౌస్ అగ్నిప్రమాద బాధితుల పట్ల విద్యుత్ శాఖ అధికారి అమానవీయ ప్రవర్తనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అభ్యర్థిస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లేఖలో ఇలా రాసుకొచ్చారు. చార్మినార్‌లోని గుల్జార్ హౌస్‌లో జరిగిన వినాశకరమైన అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మన నగరాన్ని కలచివేసింది. మృతుల కుటుంబానికి ఊహించలేని దుఃఖాన్ని కలిగించింది. బాధితులకు పరిపాలన సాధ్యమైనంత మద్దతు అందించాల్సిన సమయంలో విద్యుత్ శాఖకు చెందిన ఓ అధికారి వారి పట్ల అసభ్యకరంగా, అనైతికంగా వ్యవహరించాడు.

ఆ అధికారి ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబం నుంచి ₹2.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. అంతే కాకుండా.. ఇంట్లోని ఓ మహిళా సభ్యురాలి పట్ల అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. ఆ అధికారి ఆమె ఫోన్‌ను లాక్కొని బెదిరింపులకు దిగాడు. ఇప్పటికే బాధలో ఉన్న కుటుంబాన్ని మరింత ఇబ్బంది పెట్టడం దారుణం.. ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఇది ప్రజా సేవా నైతికతను ఉల్లంఘించడం. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ యంత్రాంగానికి చెడ్డపేరు తెస్తాయి. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో పూర్తి దర్యాప్తు జరిగే వరకు సంబంధిత అధికారిని వెంటనే సస్పెండ్ చేయండి.. సంఘటనపై ఉన్నత స్థాయి విచారణను ప్రారంభించండి. అధికారిపై చట్టపరమైన, క్రమశిక్షణా చర్యలు తీసుకునేలా చూసుకోండి. బాధిత కుటుంబానికి అవసరమైన రక్షణ, మద్దతు అందించాలని రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.



# బుడతడి బిర్యానీ కోరిక

- కేరళ అంగన్వాడీ కేంద్రాల మెనూలో మార్పు
- ఉప్మాకు బదులు చికెన్ ఫ్రై కావాలి
- రిక్వెస్ట్‌ను ఓకే చేసిన సంక్షేమ శాఖ మంత్రి వీణాజార్జ్
- కేరళలోని అంగన్‌వాడీ మెనూలో బిర్యానీ

తిరువనంతపురం, సిటీ టైమ్స్

''అంగన్వాడీలో ఉప్మాకు బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలి'' అంటూ.. బుజ్జిబుజ్జి మాటలతో ఓ చిన్నారి రిక్వెస్ట్ చేసిన వీడియో గతంలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ బుడతడి కోరిక ప్రకారం కేరళలోని అంగన్వాడీ మెనూల్లో మార్పులు జరిగాయి. మంగళవారం అంగన్‌వాడీల పునఃప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి వీణా జార్జ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె అంగన్వాడీ కేంద్రాలకు కొత్త మెనూను ప్రకటించారు. అందులో ఎగ్‌బిర్యానీ, పులావ్, దాల్ పాయసం, సోయా డ్రై కర్రీ, లడ్డూలను చేర్చారు. అంగన్వాడీ కేంద్రాలన్నింటికీ ఒకేరకమైన మెనూను అమలుచేయడం ఇదే తొలిసారని ఆమె పేర్కొన్నారు. ఇప్పటివరకు వారానికి రెండుసార్లు అందించే పాలను ఇకపై మూడుసార్లు అందించనున్నట్లు తెలిపారు.



గత ఫిబ్రవరిలో అలప్పుళకు చెందిన చిన్నారి శంకు వీడియో బాగా వైరల్ అయ్యింది. అందులో ఇంట్లో బిర్యానీ తింటూ ఆ చిన్నారి.. అంగన్వాడీలో ఉప్మాకు బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలంటూ తన తల్లిని అడిగాడు. ఆ ముద్దుముద్దు మాటలను తల్లి వీడియో తీసి, పోస్ట్ చేయడంతో అది వైరల్ అయ్యింది. ఇదికాస్తా వీణా జార్జ్ దృష్టికి వచ్చింది. దీనిపై ఆమె స్పందిస్తూ.. ప్రస్తుతం పెడుతున్న ఆహారాన్ని పరిశీలించి, మార్పులు చేస్తామని ఫేస్‌బుక్‌లో ఓ వీడియో ద్వారా హామీ ఇచ్చారు. ఇక, శంకు వీడియోకు నెటిజన్లు కూడా స్పందిస్తూ.. అంగన్వాడీ పిల్లలకు మరింత మెరుగైన ఆహారం అందించాలని కోరారు.

# జులై 21 నుంచి పార్లమెంట్

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్



పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను ఖరారు చేసింది. జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఈ సమావేశాల్లో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై చర్చించనున్నట్లు తెలిసింది. అంతేకాదు 23 రోజుల పాటూ జరిగే ఈ సమావేశాల్లో కీలకమైన బిల్లులను కూడా కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. జాతీయ భద్రత, ఆర్థిక స్థితిగతులపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**ప్రధానికి ఎంపీల లేఖ..**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసింది. మన ఆర్మీ విజయం ముంగిట ఉందనగా.. కేంద్రంలోని మోదీ సర్కారు కాల్పుల విరమణకు అంగీకరించింది. దీంతో ఈ వ్యవహారంపై యావత్తు జాతి జనుల్లో ఎన్నో ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. దీనిపై ప్రధాని మోదీ సహా ప్రభుత్వ పెద్దలు ఎవ్వరూ నోరుమెదపడం లేదు. దీంతో పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షానికి చెందిన 16 పార్టీల ప్రతినిధులు ప్రధాని నరేంద్రమోదీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై లోక్‌సభకు చెందిన 200 మందికి పైగా విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు.

**వేటిపై చర్చకు పట్టుబట్టారంటే?**

పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీల నేతలు మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్‌పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. సరిహద్దు గ్రామాల్లో పాక్ రేంజర్లు జరిపిన షెల్లింగ్‌లో ప్రాణాలు విడిచిన పౌరుల గురించి కూడా చర్చించాలని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తదనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో తమ ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వానికి మద్దతునిచ్చాయన్న విపక్ష నేతలు.. తమ డిమాండ్ మేరకు కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 2 వేల కోట్ల స్కామ్‌లో సిసోడియా, సత్యేంద్రకు సమన్లు

- ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు ఏసీబీ షాక్
- ప్రభుత్వ స్కూళ్లలో క్లాస్‌రూమ్‌ల నిర్మాణాల్లో ఫ్రాడ్
- జూన్ 6న సత్యేంద్ర, 9న సిసోడియా అటెండ్ కావాలి

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్



ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైయిన్‌లకు ఇవాళ ఢిల్లీకి చెందిన అవినీతి నిరోధక శాఖ సమన్లు జారీ చేసింది. ప్రభుత్వ స్కూళ్లలో క్లాస్‌రూమ్‌ల నిర్మాణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. జూన్ 6వ తేదీన జైయిన్, జూన్ 9వ తేదీన సిసోడియా హాజరుకావాలని ఏసీబీ తన సమన్లలో పేర్కొన్నది. ఏప్రిల్ 30వ తేదీన ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా సమన్లు ఇచ్చారు. తరగతిగదుల నిర్మాణంలోసుమారు రెండు వేల కోట్ల స్కామ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 12 వేల క్లాస్‌రూమ్‌ల నిర్మాణం కోసం ఆ కుంభకోణం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

గత ఆప్ ప్రభుత్వ సమయంలో.. ఆర్థిక, విద్యా శాఖలు మంత్రి సిసోడియా వద్దే ఉన్నాయి. సత్యేంద్ర జైయిన్ వద్ద పబ్లిక్ వర్క్‌స్‌తో పాటు ఇతర శాఖలు ఉన్నాయి. అయితే తరగతి గదుల నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తన రిపోర్టులో పేర్కొన్నది. ఆ ప్రాజెక్టులో అనేక లోపాలు ఉన్నట్లు సీవీసీ చీఫ్ టెక్నికల్ ఎగ్జామినర్ తెలిపారు. మూడేళ్ల నుంచి ఆ రిపోర్టుపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఏసీబీ సంయుక్త కార్యదిర్శి మదుర్ వర్మ తెలిపారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ ప్రకారం రిపోర్టును సేకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వర్మ వెల్లడించారు.

బీజేపీ నేతల కపిల్ మిశ్ర, హరీశ్ ఖురానా, నీలకంఠ బక్షి. 2019లో ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని మూడు జోన్లలో జరుగుతున్న క్లాస్‌రూమ్‌ల నిర్మాణాల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. 5 లక్షల ఖర్చుతో నిర్మించాల్సిన గదులకు.. సుమారు 25 లక్షలు ఖర్చు చేసినట్లు రిపోర్టు ద్వారా తెలిసింది. ఈ అక్రమాలపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నది.

# ఫాల్కన్ కేసు ప్రధాన నిందితుడు సందీప్ కుమార్ అరెస్ట్

న్యూఢిల్లీ, సిటీ టైమ్స్

సంచలనం సృష్టించిన ఫాల్కన్ గ్రూప్(క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్) మోసం కేసులో తెలంగాణ సీఐడీ దూకుడు పెంచింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సందీప్ కుమార్‌ను సీఐడీ అరెస్టు చేసింది. అతని వద్ద నుంచి రూ.2.5 కోట్ల విలువైన 3 కార్లు, 14 స్థిరాస్తి పత్రాలు, 3 సెల్‌ఫోన్లు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సందీప్ ఖాతాల్లో రూ.8కోట్ల నగదు ఉన్నట్టు గుర్తించారు. 'ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం' పేరిట నిందితులు దేశవ్యాప్తంగా బాధితుల నుంచి రూ.4,215కోట్లు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఏపీ, ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఫాల్కన్ డైరెక్టర్లపై కేసులు నమోదయ్యాయి.

సిటీటైమ్స్
www.citytimesnews.com
epaper.citytimesdaily.com


## 'సలార్ 2' కోసం ఎదురుచూస్తున్నాం

తొలి సినిమాతోనే తన ప్రత్యేకతను చాటుకొని కేజీఎఫ్‌తో ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్ . 'సలార్'తో తన టాలెంట్‌తో అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఎన్టీఆర్ , ప్రభాస్‌లు విషెస్ చెప్పారు. 'మీ మాటల కంటే.. మీ విజన్ ఎక్కువగా మాట్లాడుతుంది. తెరపై మీ మ్యాజిక్ చూసేందుకు సిద్ధంగా ఉన్నాం' అని ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్'తో సూపర్ హిట్‌ను అందుకున్న ప్రభాస్ కూడా విషెస్ చెప్పారు. "హ్యాపీ బర్త్‌డే మై సలార్. సలార్ పార్ట్2లో మరింత విధ్వంసం చేయడానికి ఎదురుచూస్తున్నా. లవ్యూ" అని తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. నిర్మాణ సంస్థలు కూడా ప్రశాంత్ నీల్ ఫొటోలు షేర్ చేస్తూ విషెస్ చెబుతున్నాయి. ప్రస్తుతం ఎన్టీఆర్‌తో తీయనున్న సినిమాతో ప్రశాంత్ నీల్ బిజీగా ఉన్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'సలార్ 2' పనులు ప్రారంభించే అవకాశం కనిపిస్తోంది. ఇక 18 ఏళ్ల తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కప్పు గెలవడంపై ప్రశాంత్ నీల్ భావోద్వేగానికి గురయ్యారు.



### అమ్మాయిలకు ఓ నమ్మకాన్నిచ్చే

## దేవిక అండ్ డానీ

"చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది" అన్నారు నటి రీతూ వర్మ. ఇది ఆమె నటించిన తొలి వెబ్‌సిరీస్. 'శ్రీకారం' విజయంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన బి.కిశోర్ దీన్ని రూపొందించారు. సుధాకర్ చాగంటి నిర్మాత. సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. "వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌లు వస్తే వెబ్‌సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకొచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు" అంది. "సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిల్ని.. 'ఈ పని చేయి, ఆ పని చేయక'ని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్‌లో చక్కగా చూపించార"న్నారు నటుడు సూర్య వశిష్ఠ. దర్శకుడు బి.కిశోర్ మాట్లాడుతూ.. "శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చూసే ప్రేక్షకుల సమయం అసలు వృథా కాదు. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివ కందుకూరి, సుధాకర్, మౌనిక, నందిని, జై క్రిష్ తదితరులు పాల్గొన్నారు.



## హేమ కమిటీ నివేదికపై ప్రభుత్వ నిర్లక్ష్యం

మలయాళ నటి పార్వతి తిరువోతు కేరళ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపులపై సుమారు ఐదున్నర సంవత్సరాల క్రితం సమర్పించిన హేమ కమిటీ నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆమె మండిపడ్డారు. 2017లో ఒక మలయాళ నటిపై దాడి జరిగిన తర్వాత, సినీ పరిశ్రమలో మహిళల పని పరిస్థితులు, భద్రతను పరిశీలించడానికి కేరళ ప్రభుత్వం జస్టిస్ హేమ అధ్యక్షతన ఈ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీ 2019లో తమ నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఈ రిపోర్ట్‌లో లైంగిక వేధింపులు, వివక్ష, సరైన సౌకర్యాల లేమి వంటి అనేక ముఖ్యమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ నివేదిక ఇచ్చినప్పటి నుంచి ప్రభుత్వం దాన్ని అమలు చేయడంలో పెద్దగా చొరవ చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో విసుగుచెందిన నటి పార్వతి తిరువోతు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ట్యాగ్ చేస్తూ పరోక్షంగా విమర్శలు గుప్పించింది. "హేమ కమిటీని ఎందుకు ఏర్పాటు చేశారో ఇప్పుడయిన గుర్తించుకుందామా? చిత్ర పరిశ్రమలో నియమ నిబంధనలు, విధానాలు రూపొందించడానికి కదా? మరి అవి ఏమయ్యాయి? తొందర ఏమీ లేదా? నివేదిక సమర్పించి ఐదున్నర సంవత్సరాలు మాత్రమే అయ్యింది కదా! అని ఆమె వ్యంగ్యంగా ప్రశ్నించింది. అయితే దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అనేది చూడాలి.



## హార్డ్‌డిస్క్ ఇంకా నా చేతికి రాలేదు



'కన్నప్ప' చిత్రం హార్డ్‌డిస్క్ మాయంపై కథానాయకుడు మంచు విష్ణు మరోసారి స్పందించారు. ఇంకా అది తన చేతికి రాలేదని తెలిపారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విష్ణు దీని గురించి మాట్లాడారు. ఇంత గొప్ప సినిమా పూర్తి చేశానంటే అది శివలీల అని అన్నారు. "ముంబయిలో ఉన్న 8 కంపెనీలు 'కన్నప్ప' వీఎఫ్ఎక్స్ పనులు చేస్తున్నాయి. వాటిలో ఒక కంపెనీ ఇక్కడ ఉన్నదానికి ఆన్‌లైన్‌లో కొంతభాగం పంపింది. అది క్లారిటీగా రాలేదు. దీంతో రెండోసారి అప్‌లోడ్ చేసి పంపింది. ముందుజాగ్రత్త కోసం వాళ్లు ఒక హార్డ్‌డిస్క్ కూడా పంపారు. నాన్నగారి ముగ్గురి పిల్లలకు సంబంధించి ఏ పార్సిల్ వచ్చినా ఆ ఇంటికే వస్తుంది. అక్కడ ఉండే మేనేజర్లు వచ్చిన పేరు బట్టి, ఎవరిది వాళ్లకు అందజేస్తారు.

## త్వరలోనే ఉస్తాద్ సెట్లోకి

కథానాయకుడు పవన్ కల్యాణ్ తన సినిమా చిత్రీకరణల్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే 'హరి హర వీరమల్లు'ను పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేసిన ఆయన ప్రస్తుతం 'ఓజీ'ని పూర్తి చేసే పనిలో పడ్డారు. కాగా, ఇప్పుడు తన మరో సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'ను పునః ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శ్రీలీల కథానాయిక. అశుతోశ్ రాణా, నవాబ్ షా, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల రెండో వారం నుంచి తిరిగి పట్టాలెక్కనుంది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. ఈ షెడ్యూల్ మొదలైన కొద్దిరోజుల్లోనే పవన్ కూడా ఈ చిత్ర సెట్లోకి అడుగు పెడతారని తెలిసింది. ఇది అన్ని రకాల వాణిజ్య హంగులతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. పవన్ ఇందులో పవర్‌ఫుల్ పోలీసు పాత్రలో అలరించనున్నారు. దీనికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



## సాహసమైనా ప్రయోజనకరమే..



ప్రస్తుతం ఓటీటీలు సినిమా నిర్మాతలకు ఓ ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. విడుదలకు ముందే సినిమాని ఓటీటీకి అమ్మితే మంచి లాభాలొస్తాయి. విడుదలకు ముందే సేఫ్ అయిపోవచ్చు. కానీ, ఆమిర్ ఈ ఓటీటీ మార్కెట్‌ను కాదనుకుని సాహసానికి సిద్ధమయ్యారు. తన సినిమాని థియేట్రికల్ రిలీజ్ తర్వాత పే పర్ వ్యూ పద్ధతిలో యూట్యూబ్‌లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. నిజానికి ఇందులో కొన్ని సవాళ్లున్నప్పటికీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించడానికి.. సినిమాని ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందికి చేరువ చేయడానికి.. దీర్ఘకాలిక ఆదాయం పొందడానికి అవకాశం కల్పిస్తోంది. ప్రస్తుతం ఎంతటి హిట్ చిత్రాలైనా సాధారణంగా 8-10 వారాల తర్వాత ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దాని వల్ల 'ఓటీటీలోనే చూసుకుందాం లే' అనుకుని థియేటర్లకు దూరం జరుగుతున్న ప్రేక్షకుల సంఖ్య అంతకంతకూ రెట్టింపవుతోంది. కానీ, ఈ యూట్యూబ్ టీవీఓడీ మోడల్ సినీప్రియుల్ని థియేటర్లకు ఆకర్షించేలా చేస్తుంది. ఎందుకంటే ఓ మంచి సినిమా ఓటీటీలోకి రావట్లేదని తెలిస్తే.. దాన్ని డబ్బులు పెట్టి యూట్యూబ్‌లో చూసే బదులు నేరుగా థియేటర్‌లో చూడాలన్న ఆసక్తి ప్రేక్షకుల్లో కలుగుతుంది. అదే జరిగి వాళ్లు సినిమా హాళ్లకు వెళ్లడం అలవాటు పడితే థియేటర్ వ్యవస్థ మళ్లీ తిరిగి గాడిన పడుతుంది.

## డిసెంబరు 5న రాజాసాబ్



ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఎట్టకేలకి విడుదల తేదీని ఖరారు చేసుకుంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. టీజర్‌ని ఈ నెల 16న విడుదల చేయనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. మంగళవారం ప్రత్యేకమైన ఓ పోస్టర్‌తోపాటు, సినిమా, టీజర్ విడుదల వివరాల్ని ప్రకటించింది నిర్మాణ సంస్థ. "భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ గొప్ప అనుభూతిని పంచుతుంద"ని సినీవర్గాలు తెలిపాయి.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B258, Phase1, Vanasthalipuram, Hyderabad 70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor : **N.Ramakrishna Reddy**, email: citytimestd@gmail.com, **RNI: APTEL/2001/5896**